# శ్రీకృష్ణ దేవరాయలు

(నవల)

కస్తూరి మురళీకృష్ణ



# శ్రీకృష్ణదేవరాయలు

**కస్తూరి మురళీకృష్ణ**



**కస్తూరి ప్రచురణలు**

***SrikrishnaDevarayalu (Novel)***
(Serialised in Andhra Bhoomi Weekly
By **Kasturi Muralikrishna**
kmkp2025@gmail.com

© Author

**First Edition** - April, 2011

***Published by :***
***K. Padma***
Kasturi Prachuranalu
Plot No. 32, Dammaiguda,
Raghuram Nagar Colony,
Nagaram Post Office,
Hyderabad - 83,
Cell : 98496 17392

**Sole Distribution :**
***Navodaya Book House***
Opp. Arya Samaj Mandir,
kachiguda X Road,
Hyderabad - 27,
Ph : 040-24652387

***Available at www.kinige.com***

***Cover Design, DTP & Printing :***
Deepthi Printers,
Gandhinagar, Hyderabad - 20
Cell : 9949703224

# శ్రీకృష్ణదేవరాయలు

**ఇ**ంకా వెలుగురేకలు ఆకాశమంతటా విస్తరించలేదు. నల్లటి ఆకాశం నీలం రంగులోకి మారటం ఇంకా ఆరంభం కాలేదు. సూర్యదేవుని రాకను ఆహ్వానించేందుకు సిద్ధమవుతున్నట్టు గాలి చల్లగా వీస్తోంది.

దూరంగా గుడిగంటల ధ్వని వినిపిస్తోంది. తెల్లవారకముందే స్వామి వారికి చేయాల్సిన సేవల కార్యక్రమాలు ఆరంభమవుతున్నాయి. పెద్దగా వినిపిస్తున్న వేదమంత్రాల లయకు తాళం వేస్తున్నట్టున్నాయి గుడి గంటలు.

మరోవైపు నుండి లీలగా తోలుబొమ్మలాటలు, పాటలు, వాయిద్యాల ధ్వనులు వినిపిస్తున్నాయి.

నరసింహావతారం అయింది కాబోలు, తారాస్థాయిలో వినిపిస్తున్నాయి వాయిద్యాలు. తోలుబొమ్మలాటలు రాత్రంతా సాగుతాయి. తెల్లవారి సూర్యోదయ సమయానికి పూర్తవుతాయి. తెర వెనుక కాగడాల వెలుగులో, తోలు బొమ్మల నీడలను తెరపై పడేట్టుచేసి అద్భుతమైన రస ప్రపంచంలోకి ప్రేక్షకులను లాక్కువెళ్తారీ కళాకారులు.

ఈ లయబద్ధమైన శబ్దాలకు స్పందించినట్టు ఇళ్ల బయట స్త్రీల ఊడ్పులు, కళ్లాపిచల్లే శబ్దాలు వినిపిస్తున్నాయి. అదో రకమైన సుగంధం, మత్తు కలగలిపి ఉత్తేజితం చేసే పరిమళం గాలిలో వ్యాపిస్తోంది.

తన చుట్టూ జరుగుతూన్న ఈ సంరంభాలను మెదడులోని ఓ భాగం స్వీకరిస్తుండగా ఆనందం అనుభవిస్తూనే ఎంతో ఏకాగ్రతతో కరవాలప్రహారాలు చేస్తున్నాడా యువకుడు. అతడిని చూడగానే మహావీరుడన్న భావన కలుగుతుంది. కండలు తీరిన శరీరం, చక్కగా అమరిన అవయవాలు, కలువల్లాంటి కళ్ళు, దృఢ చిత్తాన్ని ప్రతిబింబించే వదనం చూడగానే, యువకుడే అయినా ఎంతో విజ్ఞానవంతుడని, విచక్షణ కలవాడని తెలుస్తుంది.

రకరకాల విన్యాసాలు చేస్తున్నాడా యువకుడు. ఊహా శత్రువుతో ఉన్మత్తుడిలా యుద్ధం చేస్తున్నాడు. చూసేవారికి ఆ యువకుడి సంపూర్ణ ఏకాగ్రత కరవాల విన్యాసాలపై కేంద్రీకృతమైనట్టు తోస్తుంది. కానీ ఆ యువకుడి మెదడులో అనేకానేక ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి. శరీరం ఎంతగా స్వేద బిందువులమయమవుతోందో, అతని మనసులో అన్ని ఆలోచనల సింధువులు సుళ్ళు తిరుగుతున్నాయి. ఒక వైపు విష్ణునామావళి మననం చేస్తున్నాడు. తొమ్మిది విధాల భక్తిలో స్మరణ భక్తి కూడా ఉంది. అందుకే ఏ పని చేస్తున్నా, ఎంత ఆలోచనల్లో ఉన్నా అతని మనసు లోలోపల విష్ణుస్మరణ నిరంతరం సాగుతూనే ఉంటుంది. మరోవైపు ప్రతి కరవాల ఘాతం శత్రువులపై వజ్రపాతంలా పడుతున్నట్టు ఊహిస్తున్నాడు.

భారతదేశం అవిశ్రాంత శత్రుతాకిడితో బలహీనమవుతోంది. ధర్మం సంపూర్ణంగా రూపాంతరం చెందుతోంది. అనాగరికులైన తురుష్కుల సంపర్కంతో అద్యంతాలు లేని భారతీయ ధర్మం అల్లకల్లోలమవుతోంది. దేవాలయాలు రాళ్ళ గుట్టలవుతున్నాయి. మణి మాణిక్యాలు శత్రువుల పరమై వారికి మరింత శక్తినిస్తున్నాయి. దైవవిగ్రహాలు ముక్కలు ముక్కలయి శత్రువుల ప్రార్థనా స్థలాల మెట్లవుతున్నాయి. వారి పాదాల క్రింద నలుగుతున్నాయి. తమ దైవంపై విశ్వాసం నశించిన ప్రజలు ఆత్మవిశ్వాస రహితులవుతున్నారు. ఆత్మనూన్యతా భావంతో పెడదారులు తొక్కుతున్నారు. దిశారహితులై దిక్కుతోచకుండా బిక్కుబిక్కుమంటోంది భారతీయ సమాజం.

ఇలాంటి ఆలోచనలతో అతని ప్రహారాల వేగం హెచ్చుతోంది. బలం పెరుగుతోంది. అతను కత్తి తిప్పటంలో తాను ఒక్కడే మహాశక్తి అయి, వెల్లువలా భారతీయ సమాజాన్ని ముంచెత్తుతున్న శత్రుదాడులను అడ్డుకోవాలన్నంత తీక్షణత కనిపిస్తుంది.

మరో వైపు అతని మనోనేత్రం కమనీయమైన శ్రీ వేంకటేశ్వరుని దివ్య మంగళ స్వరూపాన్ని దర్శిస్తోంది. ఆనంద తాండవం చేస్తోంది. సకల సర్వాభరణ భూషితుడైన వేంకటేశ్వరుడి కాంతిని దర్శిస్తూ తన్మయుడవుతున్నాడు. అలౌకిక ఆనందాన్ని అనుభవిస్తున్నాడు. ఆ ఆనందం అనుభవిస్తున్న కొద్దీ అతనికి మిగతా అన్నిటిపై విరక్తి కలుగుతోంది.

ఎందుకీ ఆరాటాలు, పోరాటాలు? ఏం సాధించటం కోసం ఈ యుద్ధాలు, రాజ్యాలు? భౌతికానంద పరిమితులు దాటి, అత్యంత తీవ్రమూ, శాశ్వతమూ అయిన ఆధ్యాత్మిక అనుభూతులను అందుకొనేందుకు కాక మానవ శరీర పరమావధి మరేమిటి? అన్నీ వదలి వేంకటేశ్వర దర్శనంలో, స్తోత్రంలో, ధ్యానంలో జీవితాన్ని గడిపేయాలన్న భావన బలంగా కలుగుతోంది.

అతనికి ఇదే ఆశ్చర్యంగా అనిపిస్తుంది. ఒకేసారి మనిషి మెదడు ఎన్నో పరస్పర విభిన్నమైన ఆలోచనలను చేయగలుగుతుంది. కానీ మనిషి ప్రవర్తన తన అంతరంగ ఆలోచనలకు భిన్నంగా ఉంటుంది. బాహ్య ప్రవర్తన చూసి మనిషి గుణగణాలను నిర్ణయిస్తారు. కానీ బయట కనిపించే మనషికీ, లోపలి మనిషికీ ఎంతో తేడా ఉంటుంది.

అతని శరీరం చమటతో తడిసి ముద్ద అయిపోయింది. వ్యాయామం చాలించాడు. తల ఎత్తి ఆకాశం వైపు చూశాడు.

ప్రపంచ ప్రాణాలను తన గుప్పెటలో బంధించిన సూర్యభగవానుని
వెలుగు కలశం ఆకాశంలో ఒలికినట్టు, వెలుగురేకలు ఆకాశంలో విస్తరిస్తున్నాయి. అంధకారంలో అలసిన జగతి ఒళ్ళు విరుచుకుంటూ వెలుతురులో చైతన్యవంతమవుతోంది.

సూర్యకిరణాలు తాకటంతో ప్రాణం పోసుకున్నట్టు పక్షితతులు కిలకిలధ్వనులతో ఆకాశంలోకి ఎగిరాయి. చిన్నచిన్న పిట్టలు పెద్ద పెద్ద స్వరాలతో సూర్యుడికి స్వాగతం పలుకుతున్నాయి.

సూర్యకిరణాలు కుంచెలయి ఆకాశంపై చిత్ర విచిత్ర రూపాలలో చిత్ర లేఖనం గీస్తున్నట్టు అలవికాని అందమైన ఆకారాలలో, వింత వింత రంగులలో మేఘాలు వెలిగిపోతున్నాయి.

ఇదంతా చూస్తున్న ఆ యువకుడు తన్మయుడైపోయాడు. అప్రయత్నంగా అతని చేతులు ఒకటయి సూర్యభగవానుడికి నమస్కరించాడు.

ఎంత అందం ఉందీ ప్రపంచంలో! ఎంత ఆనందం ఉందీ భువిలో! ఎంత గొప్ప కల్పనాచాతుర్యం సృష్టికర్తది. అణువణువూ అనంతమైన అందంతో నింపేశాడు.

ఆకాశాన్ని చూస్తూ తన్మయుడై నిలచిన ఆ యువకుడి దృష్టి బయట వినిపిస్తున్న శబ్దాలతో ఆ వైపు మళ్ళింది. ఎవరో పెద్దగా అరుస్తున్నారు. వాదులాడుతున్నట్టుంది.

ఆ యువకుడి పెదవులపై వ్యంగ్య పూరితమైన చిరునవ్వు నిలుచుంది. వడివడిగా ఆ వైపు వెళ్లాడు.

ఈ యువకుడిని చూస్తూనే వాదులాడుకుంటున్న వారు నిశ్శబ్దమైపోయారు. తలలు వంచుకుని ఒదిగి నిలబడ్డారు.

"ఏమైంది?" గంభీరంగా ధ్వనించింది. ఆ యువకుడి గొంతు.

"మిమ్మల్ని విజయనగరం తీసుకురమ్మన్నారు తిమ్మరుసులవారు" వినయంగా చెప్పాడు ఓ భటుడు.

తల పంకించాడు. ఆ యువకుడు.

"నేను పూజ చేసుకునే అనుమతి ఉందా?" అడిగాడు.

"వీలయినంత త్వరగా తీసుకురమ్మన్నారు"

"ప్రభూ, కృష్ణదేవా ఇందులో ఏదో కుట్ర ఉంది. మీరు విజయనగరం వెళ్ళవద్దు. మీ ప్రాణానికి ప్రమాదం" ఆ యువకుడి అంతరంగికుడు అన్నాడు.

కృష్ణదేవుడు నవ్వాడు.

"ప్రపంచం భగవదనుసారం నడుస్తుంది. ఇందులో కుట్రలు కుతంత్రాలకు తావు లేదు. మీరు అంతా సిద్ధం చేయండి. నేను త్వరగా వస్తాను" అంటూ చకచకా లోపలకు వెళ్ళిపోయాడు. ఆ యువకుడు వెళ్ళగానే అక్కడ ఉన్న భటులంతా ఒక్కసారిగా నిట్టూర్చాడు.

"నిజంగా ఎంత గొప్ప మనిషి, చూడగానే మనసులో గౌరవభావం కలుగుతోంది. ఓ రకమైన భయం కలుగుతోంది. ఇతనే ప్రభువు అన్న భావన కలుగుతోంది" అన్నాడొక భటుడు ఆ యువకుడు వెళ్ళిన వైపే చూస్తూ.

"చూడగానే సామ్రాట్టు అనిపిస్తోంది. రాజఠీవి ఉట్టిపడుతోంది. రాజసం కనిపిస్తోంది. ఇతను రాజయితే ఇక మనకు ఎదురులేదన్న ఆత్మ విశ్వాసం కలుగుతోంది" అన్నాడింకో భటుడు.

****

**దై**వ విగ్రహం ముందు కూర్చున్న కృష్ణదేవుడి ముఖం ప్రశాంతంగా ఉంది. తనని విజయనగరం ఎందుకు పిలిచారో అతడికి తెలియదు. కానీ ఆ విషయమై ఎలాంటి ఆందోళన లేదు అతడికి. ఎందుకంటే ప్రమాదం అతడికి కొత్తకాదు. మృత్యువు అంటే భయం లేదు.

కృష్ణదేవుడి తండ్రి నృసింహదేవరాయలుకిద్దరు భార్యలు. మొదటి భార్య తిప్పాజీ పుత్రుడు వీరనరసింహుడు. రెండవ భార్య నాగలాంబ పుత్రుడు కృష్ణదేవుడు. నృసింహదేవుడి మరణం తరువాత వీరనరసింహుడు విజయనగర రాజయ్యాడు.

అవి విజయనగరానికి గడ్డురోజులు. విజయనగర సామ్రాజ్యాన్ని శత్రువులు నాలుగు వైపుల నుంచి అల్లకల్లోలం చేస్తున్నారు. సామంతరాజులు శక్తిమంతులై తిరుగుబాటు బావుటాలు ఎగురవేస్తున్నారు.

కృష్ణదేవుడు అన్నకు అండగా నిలబడ్డాడు. అన్న ఆజ్ఞలననుసరించి శత్రువులపై దండయాత్రలకు వెళ్లాడు.

కృష్ణదేవుడి పరాక్రమం, ధర్మనిరతి ప్రజలలో అతడంటే అభిమానాన్ని పెంచింది. ఇది అతడి అన్న, విజయనగర ప్రభువు అయిన వీరనరసింహుడిలో అభద్రతా భావాన్ని పెంచింది.

బాల్యం నుంచీ కృష్ణదేవుడు, వీరనరసింహుడు ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. కానీ స్వార్థం వారి నడుమ అడ్డు గోడను నిలిపింది.

తన తరువాత రాజ్యం తన సంతానానికే దక్కాలని వీరనరసింహుడు భావించాడు. వీరనరసింహుడి కొడుకు ఇంకా చిన్న పిల్లవాడు. దాంతో ఎక్కడ కృష్ణదేవుడు రాజ్యాధికారం లాక్కుంటాడేమోనన్న భయం వీరనరసింహుడిలో కలిగింది. కృష్ణదేవుడి అడ్డు తొలగించాలని నిశ్చయించాడు.

మరణశయ్యపై ఉన్న రాజు, మంత్రి తిమ్మరుసును పిలిచి, కృష్ణదేవుడి కళ్ళు పెరికించి తెమ్మన్నాడు. తన కొడుకుకు విశ్వాసంగా ఉండాలని వాగ్దానం తీసుకున్నాడు. 'సరే'నన్నాడు తిమ్మరుసు.

కానీ తిమ్మరుసుకు రాజభక్తి కన్నా ధర్మభక్తి ఎక్కువ. దేశ పరిస్థితి అతడికి తెలుసు. తురుష్కుల తుఫాను తాకిడికి భారతీయ సామ్రాజ్యాలు ఎండుటాకుల్లా ఎగిరిపోతూండటం అతడికి తెలుసు. ముంచుకొస్తున్న తురుష్క తుఫాను దక్షిణ భారతాన్ని ముంచెత్తకుండా విజయనగర సామ్రాజ్యం అడ్డుగా ఉందనీ అతడికి తెలుసు.

విజయనగర రాజు సమర్థుడు, శక్తిమంతుడూ కాకపోతే, తురుష్కుల తుఫానును అడ్డుకోవటం కష్టం. ఇప్పటికే విజయనగర రాజ్యం బలహీనమైంది. తురుష్కులు శక్తిమంతులవుతున్నారు. ధైర్యం పెరిగిన సామంతరాజులు విజయనగర సామ్రాజ్యాన్ని ప్రశ్నిస్తున్నారు. ధిక్కరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితిలో ఎనిమిదేళ్ళ పిల్లవాడు రాజవ్వటం అన్ని విధాల నష్టదాయకం.

పైగా కృష్ణదేవుడు ప్రజలందరి గౌరవాభిమానాలు చూరగొన్న వ్యక్తి. అతడంటే ప్రజలలో అభిమానం ఉంది. కృష్ణదేవుడి వీరత్వం జగద్విదితం. అతడి పాండిత్యం అందరికీ తెలుసు. దైవభక్తి అనన్య సామాన్యం. లలితకళల్లో ప్రావీణ్యం సకలలోక విదితం. అలాంటి ఉత్తముడు రాజవ్వటం వల్ల దేశానికి, ధర్మానికీ మేలు కలుగుతుంది. ఇది అర్థం చేసుకున్న తిమ్మరుసు కృష్ణదేవుడిని తన భవనానికి పిలిచాడు.

"కృష్ణదేవా....సమయం అవుతోంది. పూర్తిగా తెల్లవారితే ప్రయాణం కష్టమవుతుంది. ప్రజలు మిమ్మల్ని గుర్తు పడితే ప్రమాదం. ఇప్పటికే రకరకాల వదంతులతో రాజ్యం అల్లకల్లోలంగా ఉంది. మనం త్వరగా బయలుదేరాలి.

వినయంగా పలికిన పలుకులు శ్రీకృష్ణదేవుడి ధ్యానాన్ని భంగం చేశాయి. మెల్లగా కళ్ళు తెరిచాడు కృష్ణదేవుడు. అంతవరకూ అతని మనసులో ఉన్న దైవం, ఎదురుగా విగ్రహరూపంలో దర్శనమిచ్చాడు.

శిరస్సు వంచి నమస్కరించాడు కృష్ణదేవుడు.

లేచి నిలుచున్నాడు. “పదండి” అన్నాడు ప్రశాంతంగా.

****

అందరూ మౌనంగా ప్రయాణం చేస్తున్నారు. అందరూ ఒకే ఆలోచనతో సతమతమవుతున్నారు.

“కృష్ణదేవుడిని ఇంత హఠాత్తుగా విజయనగరం ఎందుకు పిలిచారు?”

అతడిని ప్రజలు గుర్తు పట్టకుండా మారువేషం వేశారు. చూసేవారికి ఎవరో రాజభటులు ప్రయాణం చేస్తున్నారనిపిస్తుంది.

కృష్ణదేవుడు మధ్యనఉన్నాడు. అతడికి నాలుగువైపుల అంగరక్షకులున్నారు. వారి చుట్టూ విజయనగరం నుండి వచ్చిన రాజభటులున్నారు.

దారిలో కనిపిస్తున్న దృశ్యాలను, ప్రజలను ఆనందంగా చూస్తున్నాడు కృష్ణదేవుడు. తాను ప్రమాదం వైపు పరుగిడుతున్నానన్న భావన అతడిలో ఏ కోశానా లేదు.

అతడి పక్కనే ఉన్న నాగమనాయకుడు ఉండబట్టలేక అడిగాడు.

“కృష్ణదేవా, నీకు భయం వేయటం లేదా? రాజు నీ అడ్డు తొలగించుకోవాలని నిశ్వప్రయత్నాలు చేస్తున్నాడు. ఇలాంటి పరిస్థితులలో విజయనగరం రావటం నీకు భయంగా అనిపించటం లేదా?”

దారి పక్కన నడుస్తున్న పల్లెపడుచుల వయ్యారాన్ని, వారి అందాన్ని ఆనందంతో, కవి హృదయంతో చూస్తున్న కృష్ణదేవుడు ప్రశాంతంగా నవ్వాడు.

‘నాగమ నాయకా, మీకు తెలుసు. ప్రపంచాన్ని కాపాడేది, నడిపేది శ్రీ మహావిష్ణువేనని. ఆయన ప్రపంచంలో అన్యాయం అన్నది లేదు. ప్రతి జీవితానికి అర్థం ఉంటుంది. లక్ష్యం ఉంటుంది. మా సవతి తల్లి విషప్రయోగం చేసింది నన్ను చంపాలని. నేను బ్రతికే ఉన్నాను. మా అన్నగారు, ప్రభువు వీరనరసింహరాయలు, నా అడ్డు తొలగించుకోవాలని నా కళ్లు పీకించమన్నారు. నా కళ్ళు ఈ ప్రపంచాన్ని చూస్తూనే ఉన్నాయి. దీన్ని బట్టి ఏం తెలుస్తోంది?”

“ఏం తెలుస్తోంది?”

“భగవంతుడి అనుగ్రహం ఉన్నంతకాలం మానవమాత్రులెంత చెడుచేయాలని ప్రయత్నించినా చెడు జరగదనీ. ఇన్ని ప్రయత్నాల నుండి బ్రతికి బయట పడ్డ నాకు ఇక భయం ఏముంటుంది? ఆందోళన ఏముంటుంది? నా జీవితం భగవంతుడికి అంకితం. ఇక ఏదో జరుగుతుందన్న ఆందోళన ఏముంటుంది?”

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=169**